


# విడుదల

**దేవుని పరిశుద్ధ నామమునకు మహిమ కలుగును గాక!**

**మూలవాక్యము : యోహాను 19 : 10** గనుక పిలాతు – నాతో మాటలాడవా? నిన్ను విడుదల చేయుటకు నాకు అధికారము కలదనియు, నిన్ను సిలువవేయుటకు నాకు అధికారము కలదనియు నీ వెరుగవా? అని ఆయనతో అనెను.

యేసు క్రీస్తు ఈ లోకమునకు రావడానికి గల అనేక కారణాలలో విడుదల ఇవ్వటం అనేది ప్రాముఖ్యమైనదని క్రింది లేఖనము తెలియజేస్తుంది.

**లూకా 4 : 18,19** ప్రభువు ఆత్మ నామీద ఉన్నది బీదలకు సువార్త ప్రకటించుటకై ఆయన నన్ను అభిషేకించెను చెరలోనున్న వారికి విడుదలను, గ్రుడ్డివారికి చూపును, (కలుగునని) ప్రకటించుటకును నలిగినవారిని విడిపించుటకును [19] ప్రభువు హితవత్సరము ప్రకటించుటకును ఆయన నన్ను పంపియున్నాడు అని వ్రాయబడిన చోటు ఆయనకు దొరకెను.

పై లేఖనము ప్రకారము అపవాది చేత బంధించబడిన వారికి అనేకులకు యేసయ్య విడుదల దయచేసారు అటువంటిది పిలాతునకు యేసయ్యను అప్పగించినప్పుడు పిలాతు యేసయ్యతో మాటలాడుతూ నిన్ను విడుదల చేసే అధికారం నాకున్నదని చెప్పుచున్నాడు.

## విడుదల ఎవరికి అవసరం? :

**బంధింపబడినవారికి : (కీర్తనలు 146:7)** బాధపరచువారికి ఆయన న్యాయము తీర్చును. ఆకలిగొనిన వారికి ఆహారము దయచేయును. యెహోవా బంధింపబడిన వారిని విడుదల చేయును.

**వివరణ:–** (దాని 6:16) దానియేలు సింహాల గుహలో బంధింపబడినప్పుడు దేవుడు దానియేలును విడిపించాడు. పౌలును చెరసాల నుండి దేవుడు విడిపించెను.

## దేవుడు మనలను వేటినుండి విడిపిస్తాడో వాక్యములో గమనిద్దాం :

**1. బాధల నుండి విడిపించును. (యోబు 5:19)** ఆరు బాధలలో నుండి ఆయన నిన్ను విడిపించును. ఏడు బాధలు కలిగినను నీకు ఏ కీడును తగులదు.

**వివరణ:–** మనకు బాధ వచ్చినప్పుడు మనయొక్క బాధ దేవునికి మాత్రమే చెప్పేవారిగా మనము ఉండాలి.

**2. శత్రువుల చేతినుండి విడిపించును. (కీర్తనలు 18:48)** ఆయన నా శత్రువుల చేతిలోనుండి నన్ను విడిపించును . నామీదికి లేచువారి కంటే ఎత్తుగా నీవు నన్ను హెచ్చించుదువు. బలాత్కారము చేయు మనుష్యుల చేతిలో నుండి నీవు నన్ను విడిపించుదువు.

**వివరణ:–** దావీదును చంపటానికి శత్రువులు అనేక పర్యాయములు విఫలయత్నం చేసినప్పుడు దావీదును దేవుడు శత్రువుల చేతి నుండి విడిపించాడు.

**3. నా పాదములను వల నుండి విడిపించుట.(కీర్తనలు 25:15)** నా కనుదృష్టి యెల్లప్పుడు యెహోవావైపునకే తిరిగి యున్నది. ఆయన నా పాదములను వలలో నుండి విడిపించును.

**వివరణ:–** తప్పుడు త్రోవలో నీవు నడిచినట్లయితే 'ఆయన పాదాలలో మేకులను' జ్ఞాపకం చేసుకునే వారిగా ఉండాలి.

**4. దుష్టుల చేతిలో నుండి విడిపించును.(యిర్మియా 15:21)** దుష్టుల చేతిలోనుండి నిన్ను విడిపించెదను, బలాత్కారుల చేతిలోనుండి నిన్ను విమోచించెదను.

**వివరణ:-** దేవుని నమ్మిన ప్రతి వ్యక్తిని కూడా ఆయన దుష్టుని చేతినుండి విడిపంచును.

**5. శ్రమల నుండి విడిపించును. (కీర్తనలు 91:15)** అతడు నాకు మొఱ్ఱపెట్టగా నేనతనికి ఉత్తరమిచ్చెదను. శ్రమలో నేనతనికి తోడైయుండెదను. అతనిని విడిపించి అతని గొప్ప చేసెదను.

**వివరణ:-** నీకు ఏ శ్రమ అయిన రాని నీవు ఉపవాసముండి ప్రార్థించిన యెడల ఆయన నిన్ను ఆ శ్రమ నుండి విడిపించగల సమర్థుడు.

**6. ఆపదలన్నిటి నుండి విడిపించును. (కీర్తనలు 54:7)** ఆపదలన్నిటిలో నుండి ఆయన నన్ను విడిపించియున్నాడు నా శత్రువుల గతిని చూచి నా కన్ను సంతోషించుచున్నది

**వివరణ:-** ఈ లోకంలో ఎవరు కూడా ఆపదవచ్చినప్పుడు ఆదుకోరు కాని. నీవు ఆపదలలో ఉన్నావు అని దేవునికి తెలుసు గనుక ఆపదలన్నిటినుండి నిన్ను విడిపించును.

**7. ధర్మశాస్త్రమునుండి విడుదల. (రోమా 7:6)** ఇప్పుడైతే దేనిచేత నిర్బంధింపబడితిమో దాని విషయమై చనిపోయినవారమై, ధర్మశాస్త్రమునుండి విడుదల పొందితిని గనుక మనము అక్షరానుసారమైన ప్రాచీనస్థితి గలవారముకాక ఆత్మానుసారమైన నవీనస్థితి గలవారమై సేవచేయుచున్నాము.

**8. మరణము నుండి విడిపించును. (సామెతలు 13:14)** జ్ఞానుల ఉపదేశము జీవపు ఊట అది మరణపాశములలో నుండి విడిపించును.

**వివరణ:-** చనిపోయిన లాజరును ఆయన బ్రతికించెను.

**9. పాతాళమునుండి విడిపించును. (యోబు 33:24)** దేవుడు వానియందు కరుణజూపి పాతాళములోనికి దిగి వెళ్లకుండ వానిని విడిపించును. ప్రాయశ్చిత్తము నాకు దొరికెనని సెలవిచ్చును.

**వివరణ:-** పాతాళాన్ని తప్పించేది యేసునామం ఒకటే.

## దేవుడు ఎవరికి విడుదల కలుగజేస్తాడు :

**1. యూదులకు (దేవుడు ఏర్పరచుకున్న వారికి, స్తుతి చేయువారికి) : (ఎస్తేరు 4:14)** నీవు ఈ సమయమందు ఏమియు మాటలాడక మౌనంగా వున్న యెడల యూదులకు సహాయమును విడుదలయు మరియొక దిక్కునుండి వచ్చును గాని, నీవును నీ తండ్రి యింటివారును నశించుదురు. నీవు ఈ సమయమును బట్టియే రాజ్యమునకు వచ్చితివేమో ఆలోచించుకొనుమని చెప్పుమనెను.

**వివరణ :** క్రమమైన స్తుతి జీవితంగల వారికి దేవుడు విడుదల దయచేస్తాడు.

**2.దేవునికి మొఱ్ఱపెట్టువారికి విడుదల కలుగును. (కీర్తనలు 22:5)** వారు నీకు మొఱ్ఱపెట్టి విడుదల నొందిరి. నీయందు నమ్మికయుంచి సిగ్గుపడక పోయిరి.

**వివరణ:-** ఆయనకు నిజంగా మొఱ్ఱపెట్టువారిని ఆయన విడిపించును. ఆయన మీద ఆధారపడువారిని ఆయన ఎన్నడు విడువడు.

**ముగింపు :**

**దేవుడు నిన్ను విడిపించాలంటే ?**

మీ పవిత్రమైన భక్తిని బట్టి, ప్రార్థనను బట్టి, మంచి నీతి దాయకమైన నీ జీవితమును బట్టి, గొల్యాతులాంటి శత్రువులకు కూడా, దేవుడు తప్పనిసరిగా వారికి బుద్ధి చెప్పే గొప్ప దేవుడని దయచేసి నువ్వు గుర్తుపెట్టుకో... దేవుడంటే, దేవుని వాక్యం అంటే? ఆశామాషి కాదు, గొప్ప కార్యములను చేయగల దేవుడు మనపక్షముగా ఉన్నాడని గ్రహించు. ఆయన మనకందరికిని విడుదల కలిగించును గాక! ఆమేన్...ఆమేన్...ఆమేన్.